
ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6 : కనిష్ఠం 21.4



డిగ్రీ కళాశాలలో వరలక్ష్మీ వస్త్రాలంకరణ పోటీలు

బిచ్కుంద, ఆగస్టు 23: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మహిళా సాధికారత ఆధ్వర్యంలో వరలక్ష్మీదేవి వస్త్రాలంకరణ పోటీలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు విద్యాబుద్ధులతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించడంతో పాటు విద్యార్థినుల కళా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నిర్వహించిన వరలక్ష్మీ వస్త్రాలంకరణ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళల కళా నైపుణ్యాధికారి రేవతి, కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.



భూమాతపైనే.. ఆశలు!

- ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని ధరణి భూ సమస్యలు
- ఇప్పటికీ పెండింగ్‌లోనే ధరణి దరఖాస్తులు
- ధరణి లోటుపాట్లను సవరిస్తూ భూమాత పేరిట ఆర్‌వోఆర్ చట్టం
- ఆర్‌వోఆర్ చట్టం అమలుకు కసరత్తు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ చట్టంపై రైతులు, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ
- అధికారులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వం
- జిల్లాలో ఇప్పటికీ పెండింగ్‌లో 13వేలకు పైగా ధరణి దరఖాస్తులు

కామారెడ్డి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సంవత్సరాల తరబడి పెండింగ్ భూ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. భూ సమస్యలను శాశ్వతంగా తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకురానుంది. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి లోటుపాట్లను సవరిస్తూ భూ మాత పేరిట తీసుకొస్తున్న ఆర్‌వోఆర్ చట్టంపై రైతుల్లో, భూ యజమానుల్లో ఆశలు నెలకొంటున్నాయి. కొన్నేళ్లుగా భూమికి సంబంధించిన రికార్డుల్లో అనేక రకాల మార్పులు తీసుకువచ్చిన భూముల విషయంలో తగదాలు, అవినీతి, అక్రమాలు తగ్గడం లేదు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌లో క్లియర్‌గా ఉన్న భూములకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ధరణిలో నమోదు కాని భూములతో అనేక సమస్యలు వస్తున్నాయి. ఇక పీవోపీ కింద ఉన్న భూముల్లో కొందరు అధికారులు, నాయకులు దందాలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూమాత పేరిట నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే అసెంబ్లీలో ముసాయిదా బిల్లును ప్రవేశపెట్టారు. ఈ చట్టాన్ని అమలు చేసేందుకు రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ చట్టం అమలు చేసేందుకు అధికారులకు సైతం అవగాహన కల్పిస్తున్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో అధికారులకు ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పరిష్కారానికి నోచుకోని ధరణి దరఖాస్తులు

గత ప్రభుత్వం 8 ఏళ్ల కిందట తీసుకువచ్చిన ధరణి భూ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. జిల్లా వ్యాప్తంగా ధరణికి భూ సమస్యలపై 50,494 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 34,503 దరఖాస్తులు ఆమోదం పొందినవి ఉన్నాయి. 10,700ల దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. మరో 3,271 దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ధరణి పోర్టల్‌లో పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి ఖచ్చితమైన ఆప్షన్‌లు లేకపోవడం, క్షేత్రస్థాయి విచారణకు సిబ్బంది కొరత సమస్యగా మారిందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సాంకేతిక చిక్కుల పరిష్కారానికి ఎన్నో ఆప్షన్‌లను ప్రవేశపెట్టినప్పటికీ మూడు కేటగిరీల్లో నమోదైన దరఖాస్తులు అత్యధికంగా తిరస్కరణకు గురవుతున్నాయి. జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంటుంది. గతానికి భిన్నంగా దరఖాస్తులు తహసీల్దార్ నుంచి ఆర్డీవోకు ఆ తర్వాత అదనపు కలెక్టర్, కలెక్టర్ లాగిన్‌కు చేరాల్సి ఉండేది. దీంతో దరఖాస్తుల పరిష్కారంలో కొంతమేర జాప్యం జరుగుతూ వచ్చింది. మూడు స్థాయిలో నోట్‌ఫైల్ సిద్ధం చేయడం, సెద్వార్, కాస్రా పహాణీలతో పాటు ఆర్‌ఎస్‌ఆర్ రిజిస్టర్‌లు పరిశీలించాల్సి వచ్చేది. దీంతో పలు దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించే సిబ్బందికి అవగాహన, అవసరమైన రికార్డులు అందుబాటులో లేకపోవడంతో అధిక సంఖ్యలో తిరస్కరణకు గురవతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఆర్‌వోఆర్ చట్టానికి సన్నాహాలు

ధరణి పోర్టల్‌ను భూమాతగా మార్చడంతో పాటు కొత్త ఆర్‌వోఆర్ చట్టం అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇప్పటికే ఆర్‌వోఆర్ చట్టం అమలుకు శాసనసభలో ప్రభుత్వం ప్రకటించింది. అసెంబ్లీ ఆమోదం తెలిపిన తర్వాత చట్టంగా మారింది. దీంతో చట్టం అమలు కోసం ఇప్పటికే ప్రజలు, రైతుల నుంచి అభిప్రాయాల స్వీకరణ చేపట్టారు. ఆర్‌వోఆర్ చట్టాన్ని అమలులోకి తీసుకుని వచ్చేందుకు రెవెన్యూ అధికారులకు సైతం అవగాహన కల్పిస్తున్నారు. ఈ చట్టం అమలుతో పాటు రెవెన్యూ గ్రామానికి ఒక అధికారిణి నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన వేగవంతం అవుతుందని అన్ని వర్గాల వారు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పటిష్టం కానున్న రెవెన్యూ వ్యవస్థ

గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో పాటు రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనతో గ్రామస్థాయిలో పనిచేసే వీఆర్‌వోలు, వీఆర్‌ఏలను ఆయా శాఖల్లో విలీనం చేశారు. జిల్లాలో రెవెన్యూ వ్యవస్థను రద్దు చేసే సమయానికి వీఆర్వో, వీఆర్‌ఏలు పనిచేసేవారు. వీఆర్వోలను ఆయా శాఖల్లో విలీనం చేశారు. అర్హత గల వీఆర్‌ఏలను పేస్కేల్ వర్తింపజేస్తూ ఆయా శాఖల్లో జూనియర్ అసిస్టెంట్‌లుగా అర్హతలేనివారిని నీటి పారుదల శాఖలో నీరడీలుగా నియమించారు. 60 ఏళ్లకు చెరువలో ఉన్న వారి విషయమై ప్రస్తుతానికి ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం తీసుకువస్తున్న బిల్లుల్లో గ్రామానికో రెవెన్యూ కార్యదర్శిని నియమిస్తామని ప్రభుత్వం చెబుతోంది. గ్రామస్థాయిలో జరుగుతున్న ఆయా అంశాలతో పాటు శాంతిభద్రతలు, ఇతరత్రా అంశాలు రెవెన్యూశాఖకు బదిలీ కానున్నాయి. దీంతో మరోసారి రెవెన్యూ వ్యవస్థ పటిష్టం కానుంది.

పారదర్శకత పెరిగే అవకాశం

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలులోకి తీసుకురానున్న కొత్త ఆర్‌వోఆర్ చట్టంతో భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత నెలకొంటుందని దళారుల వ్యవస్థ అరికట్టవచ్చని పలువురు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అన్నిరకాల సేవలకు కలెక్టర్‌లతో ముడిపడి ఉండగా తాజా చట్టంతో తహసీల్దార్లకు, ఆర్డీవోలకు బదలాయింపును కేటాయించారు. ముఖ్యంగా మ్యూటేషన్, సాదా బైనామా, పోఆర్‌సీ అప్పిలింగ్‌కు సంబంధించిన అంశాలను ఆర్డీవోలకు అందించనుండగా, పౌతి, వీరసత్‌తో పాటు మరి కొన్ని అంశాలను తహసీల్దార్లకు అప్పగించనున్నారు. ఇక కలెక్టర్ స్థాయిలో ఇప్పటి వరకు ఉన్న పని భారం ఆర్డీవోలకు, తహసీల్దార్లకు ఆయా అంశాలు బదిలాయించడంతో కలెక్టర్‌లపై పని భారం తగ్గనుంది. ఇప్పటి వరకు ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా సివిల్ కోర్టుకు వెళ్లాల్సి ఉండగా ప్రస్తుతం తహసీల్దార్ స్థాయిలో జరిగిన తప్పిదాలపై ఆర్డీవో స్థాయిలో అక్కడ న్యాయం జరగని పక్షంలో అదనపు కలెక్టర్ స్థాయిలో అప్పిలింగ్ వ్యవస్థను తీసుకురానున్నారు. ఈ వ్యవస్థ లేకపోవడంతో ధరణి పోర్టల్ వచ్చినప్పటి నుంచి అనేక కేసులు నమోదైనట్లు రెవెన్యూ రికార్డుల ద్వారా తెలుస్తోంది.

డబ్బులిస్తేనే పనులు చేస్తున్నారు

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

నాగిరెడ్డిపేట, ఆగస్టు 23: నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయంలో దళారుల ద్వారా డబ్బులిస్తేనే అధికారులు పనులు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారి పనులు చేయడం లేదని ఆరోపిస్తూ పలువురు రైతులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి తమ నిరసన తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపేట, ధర్మారెడ్డి తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు కార్యాలయం ముందు నిరసన తెలిపారు. నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య తన కూతురుకు ఇల్లరికం తెచ్చుకున్న అల్లుడు పరమేశ్వర్‌కు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు రెసిడెన్సి సర్టిఫికెట్లు జారీ చేశారని, ప్రస్తుతం ఆదాయం, కుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేస్తే అధికారి కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నాడని ఆయన ఆరోపించారు. ఇటీవల తన కుటుంబ సభ్యుల పేరిట గల పట్టా భూమి పేర్ల మార్పిడికి సంబంధించి స్థానిక మీ సేవలో మూడు డాక్యుమెంట్ల కోసం చలాన్ డబ్బులు చెల్లించినప్పటికీ, రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇవ్వడం కోసం మీసేవ నిర్వాహకుడు ఒక్కో డాక్యుమెంట్‌కు నాలుగు వేల రూపాయల చొప్పున రూ.12 వేలు అదనంగా తీసుకున్నట్లు కుమ్మరి అంజయ్య ఆరోపించారు. మధ్యవర్తి ద్వారా అధికారికి డబ్బులు ముడితేనే తమ పని పూర్తయిందని ఆయన ఆరోపించారు. అలాగే ధర్మారెడ్డి గ్రామానికి చెందిన తన అత్త సుశీల మృతి చెందిందని, సుశీల పేరిట 12 గుంటల పట్టా భూమి ఉందని, సుశీలకు కూతురు ఎల్లవ్వ తప్ప మరెవరూ వారసులు లేని ఎల్లవ్వ భర్త గుల్లపల్లి బాలయ్య తెలిపారు. తల్లి సుశీల పేరిట ఉన్న భూమిని కూతురు ఎల్లవ్వ పేరిట మార్పిడి చేయడం కోసం మీ సేవలో చలాన్ డబ్బులు చెల్లించి మూడు నెలలు అవుతున్నా ఇప్పటికీ అధికారి పేరు మార్పిడి జరపలేదని ఆయన ఆరోపించారు. నేరుగా తాను కార్యాలయానికి వచ్చి తన భార్య పేరిట భూమి మార్పిడి చేయమని అధికారికి అడుగుతున్నందునే అధికారి తమ పని చేయడం లేదని దళారులతో వచ్చి ఉంటే అధికారులు పనులు చేసే వారని ఆయన ఆరోపించారు. మూడు నెలలుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏకు బదులుగా ఆయన కుమారుడు పని చేస్తున్నాడని ఇతను కూడా మధ్య దళారిగా వ్యవహరిస్తుంటాడని వారు ఆరోపించారు. రెవెన్యూ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని రైతులు తెలిపారు.



నాగిరెడ్డిపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న రైతులు

అవినీతికి పాల్పడటం లేదు

- తహసీల్దార్ లక్ష్మణ్

దళారుల ప్రమేయంతోనే తహసీల్దార్ కార్యాలయంలో పనులు జరుగుతున్నాయని వచ్చిన అవినీతి ఆరోపణల విషయమై స్థానిక తహసీల్దార్ లక్ష్మణ్‌ను స్థానిక విలేకరులు వివరణ కోరగా.. తాను ఎలాంటి అవినీతికి పాల్పడడం లేదన్నారు. నిబంధనల ప్రకారమే తాను పనులు చేస్తున్నట్లు తెలిపారు. తన పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి రాలేదని, తన పేరు చెప్పి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

రుణమాఫీకి ఇబ్బందులకు గురి చేస్తున్న బ్యాంకు అధికారులు

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన రైతులు



ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

బిచ్కుంద, ఆగస్టు 23: రైతు రుణమాఫీలో ఎస్‌బీఐ బ్యాంక్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండల రైతులు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఏవోకు సమగ్ర నివేదికను అందించాలని ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, రైతువేదిక, ట్యాంక్ బండిపై పల్లె ప్రకృతి వనం, ఎంఎల్‌ఎస్ పాయింట్, ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని వంటగది, వంట సామగ్రి విద్యార్థులకు అందించే భోజనాన్ని తనిఖీ చేపట్టి తరగతి గదులను రికార్డులను పరిశీలించి ప్రాంగణంలో మొక్కలు నాటారు. మెరుగైన విద్యాబోధన అందివడంతో పాటు విద్యార్థులకు పౌష్టిక విలువలు గల రుచికరమైన ఆహారాన్ని అందివ్వడానికి అశ్రద్ధ వహించరాదని తెలిపారు. ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీలో పొరపాటు ఉండి రుణమాఫీ కాని రైతుల వివరాలు సరిచేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు అందించాలని నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి వైద్యసిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని తెలిపారు. విధుల నిర్వహణలో మండల స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీవో రమేష్‌రాథోడ్, బిచ్కుంద తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో గోపాల్‌కుమార్, ఐకేపీ ఏపీఎం నాగరాజు, ఏవో రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కల్పించని జీవదాన్ పాఠశాల యాజమాన్యం

కామారెడ్డి టౌన్, ఆగస్టు 23: దేవునిపల్లి రోడ్డులో గల జీవదాన్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ అన్నారు. శుక్రవారం జీవదాన్ పాఠశాలకు అధికారులతో కలిసి తనిఖీ చేపట్టారు. విద్యార్థుల కోసం వినియోగిస్తున్న పాఠశాల బాత్రూంలు అధ్వానస్థితిలో ఉండడంతో యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులతో పాటు డెంగ్యూ, మలేరియా లాంటి వ్యాధులు సక్రమిస్తున్నాయని పాఠశాలలో సరైన శుభ్రత పాటించడం లేదని పలువురు తల్లిదండ్రులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. గతంలోనే పాఠశాల బయట చెత్తాచెదారం వేయకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులతో పాటు తాను సైతం పాఠశాల యాజమాన్యానికి సూచించానని తెలిపారు. విద్యార్థులకు అనుగుణంగా టాయిలెట్స్ ఉండాల్సి ఉండగా కేవలం 8 మాత్రమే ఉన్నాయని 2 వేల పైచిలుకు విద్యార్థులకు కేవలం 8 టాయిలెట్స్ ఏం సరిపోతాయా అని ప్రశ్నించారు. ఇష్టారీతిన ఫీజులు పెంచడం, అర్హత లేని ఉపాధ్యాయులతో టీచింగ్ చేయించడం, విద్యార్థులను స్థాయికి మించి తరగతి గదిలో కూర్చోబెట్టడం చేస్తున్నారని అన్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫోన్‌లో మాట్లాడి ఆయా పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి పట్టణ కౌన్సిలర్‌లు, జిల్లా అగ్నిమాపక అధికారి సుధాకర్, మున్సిపల్ కమీషనర్ సుజాత ,శానిటరీ ఇన్స్‌పెక్టర్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



జీవదాన్ పాఠశాలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

కెమికల్ ఫ్యాక్టరీలు.. భద్రమేనా?

- పలు ఫ్యాక్టరీల సమీపంలో యూనివర్సిటీ, పాఠశాలలు
- గతంలో రియాక్టర్‌లు పేలిన సంఘటనలు
- పట్టనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

భిక్కనూరు, ఆగస్టు 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకాపల్లిలో ఎసెన్షియా కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంతో కామారెడ్డి జిల్లాలో ఎక్కువగా కెమికల్ ఫ్యాక్టరీలున్న భిక్కనూరు మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. భిక్కనూరు మండలంతో పాటుగా చుట్టూ దాదాపు పది వరకు కెమికల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటన్నింటిలో చాలా పెద్దది మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న ఎంఎస్‌ఎన్ ఫార్మా కంపెనీ. ఈ కంపెనీల ఏర్పాటు సమయంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కెమికల్ ఫ్యాక్టరీల యాజమన్యాలు అన్ని జాగ్రత్తలతో పాటుగా పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని చెప్పి ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తి కాగానే ఇందులో చాలా కెమికల్ ఫ్యాక్టరీలు నిబంధనలను ఉల్లంఘించడంతో పాటుగా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయి. కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికుల భద్రతను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. భిక్కనూరు మండలంలో గతంలో పలు కెమికల్ ఫ్యాక్టరీల్లో రియాక్టర్లు పేలిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ కెమికల్ ఫ్యాక్టరీల్లో ఇంత భయానక పరిస్థితి ఉంటుందా అని అందులో పని చేసే వారితో పాటుగా వారి కుటుంబ సభ్యులు, మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్న పరిస్థితి ఉంది. దీనికి తోడు మండలంలోని కెమికల్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే విష వాయువులతో పాటుగా దుర్వాసనతో భిక్కనూరు, దోమకొండ, రాజంపేట మండలాల్లోని చాలా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఉంది. రాత్రి అయ్యిందంటే చాలు కెమికల్ ఫ్యాక్టరీల నుంచి వచ్చే దుర్గంధంతో ముక్కులు పగిలిపోతున్నాయి.

గతంలో రియాక్టర్‌లు పేలిన సంఘటనలు

భిక్కనూరు మండలంలోని ఉన్న పెద్ద, చిన్న కెమికల్ ఫ్యాక్టరీల్లోని చాలా వాటిలో గతంలో రియాక్టర్‌లు పేలిన సంఘటనలు ఉన్నాయి. ఈ ప్రమాదంలో దాదాపుగా పదుల సంఖ్యలో గాయపడగా ఒకరిద్దరు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాద సమయంలో ఫ్యాక్టరీల యాజమన్యాలు వారికున్న రాజకీయ అండతో ప్రమాద సంఘటనలను బయటకు రాకుండా లోలోపల బాధితుల కుటుంబ సభ్యులతో సెటిల్‌మెంట్‌లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పలు ఫ్యాక్టరీల్లో ఇలాంటి ప్రమాద సంఘటనలు కొన్ని బయటకు వచ్చినప్పటికీ బయటకు రాని ప్రమాద సంఘటనలు చాలానే ఉన్నాయన్నది కార్మిక సంఘాల ప్రధాన ఆరోపణ. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల కూలీలే ఎక్కువగా ఈ ఫ్యాక్టరీల్లో పని చేస్తుండటంతో లోపల వారికి ఎలాంటి ప్రమాదం జరిగినా బయటకు రావడం లేదని కార్మిక సంఘాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భిక్కనూరులోని కెమికల్ ఫ్యాక్టరీ

ఈ కెమికల్ ఫ్యాక్టరీల సమీపంలోనే యూనివర్సిటీ, పాఠశాలలు

భిక్కనూరు మండలంలో ఆయా గ్రామాల్లో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలకు అతి సమీపంలో తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్, మహాత్మా జ్యోతిబా పూలే, ప్రభుత్వ పాఠశాలలు, ఆలయాలు ఉన్నాయి. వీటితో పాటుగా వీటి చుట్టూ వ్యవసాయ భూములు ఉండటంతో నిత్యం రైతులు, పాఠశాలలు, కళాశాలల్లో అభ్యసించే విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆలయాల సిబ్బంది, అర్చకులు నిత్యం ఈ ఫ్యాక్టరీల నుంచి వచ్చే విషపూరిత దుర్వాసన కారణంగా అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్యపై చాలా సార్లు స్థానిక యువకులు, కొందరు ప్రజాప్రతినిధులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు, జిల్లా అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

లోపలికి ఎంట్రీ ఎవరికీ ఉండదు

కామారెడ్డి జిల్లాలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీల యాజమాన్యాలు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నాయని, కార్మికులను సైతం ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ కెమికల్ ఫ్యాక్టరీల్లో లోతైనా గుంతలను తవ్వి వాటిలో కెమికల్ వ్యర్థాలను వదులుతున్నారన్న ఆరోపణలు చాలానే ఉన్నాయి. కెమికల్ వ్యర్థాలను తవ్విన గుంతల్లో వేయడం కారణంగానే చుట్టూ ఉన్న వ్యవసాయ బావుల్లో నీరు కలుషితమై, రంగురంగుల్లో రావడం, చుట్టూ ఉన్న చెరువు, కుంటల్లోని చేపలు మరణిస్తున్నాయని ఫ్యాక్టరీల చుట్టూ ఉన్న గ్రామాల ప్రధాన ఆరోపణ. వీటిని పరిశీలించడానికి గానీ, ప్రశ్నించడానికి గానీ, ఆందోళనలు చేసిన సమయంలో గానీ యువజన, కార్మిక సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులకు, ప్రజలను ఎవరిని లోనికి రానివ్వరు. ఫ్యాక్టరీకి సంబంధించిన ఏ అధికారి వారిని కలువరు. ఎందుకని ఎవరైనా ప్రశ్నిస్తే లోనికి వెళ్లడం ప్రమాదమని సమాధానమిస్తారు. అధికారులతో, ప్రజాప్రతినిధులతో చెప్పించినా ఫలితం ఉండదు. కానీసం గేటు లోనికి కూడా వెళ్లే పరిస్థితి ఉండదు.

గతంలో నిరాహార దీక్ష చేసిన కాచాపూర్ గ్రామస్థులు

భిక్కనూరు ఎంఎస్‌ఎన్ కంపెనీ నుంచి వచ్చే దుర్వాసనతో పాటుగా కంపెనీలో వ్యర్థాల కారణంగా చెరువులు, కుంటలు, బోరుబావులు కలుషితమవుతున్నాయని, దీంతో తాము గ్రామంలో ఉండలేకపోతున్నామని గతంలో భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామ ప్రజలు పార్టీలకు, కులాలకు అతీతంగా చుట్టూ గ్రామాల ప్రజలను కలుపుకుని వంద రోజులకు పైగా నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు భిక్కనూరు, జంగంపల్లి గ్రామాల శివారుల్లో ఉన్న ఈ కెమికల్ ఫ్యాక్టరీలను మూసివేయాలని ఈ ఫ్యాక్టరీల ఎదుట ధర్నాలు, ఆందోళన కార్యక్రమాలు చేసిన సంఘటనలు ఉన్నాయి.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

వేల్పూర్, ఆగస్టు 23: మండలంలోని లక్కోర గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం ఎంపవర్ నిర్మాణ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీ రాజ్ మాట్లాడుతూ.. తమ క్లబ్ ఆధ్వర్యంలో పలు రకాల సామాజిక సేవలు చేపట్టడం జరిగిందని, ముఖ్యంగా పాఠశాలలో విద్యార్థులకు విద్యాబోధన అవసరమైన వస్తువులను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీ రాజ్, సభ్యులు బైరి శ్రీధర్, గుర్రం విజయానంద్, లక్కోర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయాధికారులకు దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

రుణమాఫీకి దరఖాస్తుల స్వీకరణ

ముప్కాల్ ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా రూ.లక్ష లోపు పంట రుణం కలిగి ఉండి రుణమాఫీ జరగని రైతుల నుంచి వ్యవసాయా శాఖ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. సాంకేతిక లోపం వల్ల, ఇతర కారణాల వల్ల రుణమాఫీ జరగని రైతులు రూ.2లక్షల పంట రుణం జరగని రైతులు మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించబడుతాయని రైతులకు తెలియజేశారు.

సార్వజనిక్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా శ్రీకాంత్

బోధన్‌రూరల్, ఆగస్టు 23: బోధన్ సార్వజనిక్ నూతన ఉత్సవ కమిటీని శుక్రవారం బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వరాలయంలో ఎన్నుకున్నారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శ్రీ సార్వజనిక్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కే.శ్రీకాంత్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా తాడు మహేష్, కోశాధికారిగా గంగుల దేవిదాస్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ గ్రామ కమిటీ అధ్యక్షులు బాగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, సూర్యప్రకాష్, బీర్కూర్ బుజ్జి, విజయ్, పిట్ల సత్యం, రాములు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామశివారులో గల శ్రీ కృష్ణమందిరం, శ్రీ బ్రహ్మజ్ఞాన ఆశ్రమంలో సోమవారం శ్రీ కృష్ణష్టమి వేడుకలను నిర్వహించడం జరుగుతుందని శ్రీ బ్రహ్మజ్ఞాన ట్రస్ట్ ఛైర్మన్ రంగు హన్మాగౌడ్ శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భిక్కనూరులో సైన్స్ టాలెంట్ టెస్ట్

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నేషనల్ స్పేస్ డేను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే సైన్స్‌పట్ల ఆసక్తిని పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్, సూజాత, సైన్స్ ఉపాధ్యాయుడు తమ్మల రాజు, ఆయాపాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు 23: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థినులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఎంపవర్ నిర్మాణ్ కార్యక్రమంలో భాగంగా శానిటరీ నాప్కిన్స్‌ను అందజేశారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉంటూ తమ ఆరోగ్యాల పట్ల జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ నవనాథపురం అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, అంబల్ల తిరుపతి, గుర్రం విజయానంద్, బైరి శ్రీధర్, చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ నుస్రత్‌జహన్, లెక్చరర్‌లు బి.వనిత, తదితరులు పాల్గొన్నారు.

















పోతంగల్‌లో ఇసుక డంప్‌ల సీజ్



సీజ్ చేసిన ఇసుక ఇదే..

కోటగిరి,ఆగస్టు23: పోతంగల్ మండల కేంద్రంలో అక్రమంగా నిల్వ చేసిన 45ట్రాక్టర్ల ఇసుక నిల్వలను శుక్రవారం తహసీల్దార్ మల్లయ్య సీజ్ చేశారు. పోతంగల్ గ్రామానికి చెందిన శెట్టి నవీన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరభద్రుడి గుడి వద్ద 35ట్రాక్టర్ల ఇసుక డంప్‌ను సీజ్ చేశామని తహసీల్దార్ తెలిపారు. కొడిచర్ల రహదారిలో మరో 10ట్రాక్టర్ల ఇసుక డంప్‌లను గుర్తించి సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ఇసుకకు శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తామని తహసీల్దార్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.5వేల డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ

ఆర్మూర్‌టౌన్,ఆగస్టు23: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన బాలపల్లి నర్సవ్వ అనే వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని దొంగలు నాలుగు తులాల బంగారు నగలను చోరీ చేశారు. పెర్కిట్‌లోని తన ఇంటి నుంచి ఎంఆర్ గార్డెన్‌లో జరిగే బంధువుల పెళ్లికి ఆటోలో వెళ్లగా ఆటోలో ఉన్న ముగ్గురు మామిడిపల్లి శివారులోకి తీసుకువెళ్లి ఆటోను నిలిపి వృద్ధురాలి మెడలో ఉన్న నాలుగు తులాల బంగారు నగదును దోచుకొని వృద్ధురాలిని తోసి వేసి పరారయ్యారు. దీంతో వృద్ధురాలు రోదించడంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోధన్‌లో సామూహిక సీమంతాలు

బోధన్‌రూరల్,ఆగస్టు23: బోధన్ పట్టణంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ చైర్మన్ కొత్తపల్లి నవిత, తన్నీరు రాజ్యలక్ష్మి, వేమూరి లక్ష్మిలు మాట్లాడుతూ మాతృత్వం వరం లాంటిదని పేర్కొన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తల గురించి వివరించారు. గర్భిణులు మానసిక ఆరోగ్యంతో పాటు ఉల్లాసంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు భారతి, అంజనా దేవి, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, మంజూష, సుబ్బారావు, పోశెట్టి, ఆదినారాయణ రెడ్డి, తదితరులున్నారు.

మెరుగైన వైద్యసేవలే ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్,ఆగస్టు23: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడి నాగేశ్వర్ రావు, మందర్నా రవి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమకు అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నప్పటికీ వాటికి సీఎం సహాయనిధి కింద నిధులను ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుందన్నారు. మెరుగైన వైద్యం అందించడం కోసం ప్రభుత్వం అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ శరత్ రెడ్డి, మాజీకౌన్సిలర్ దాము, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి, పీప రమణలతో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

ఎడపల్లి, ఆగస్టు23: మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సూర్య ఆరోగ్యసంస్థ, ఛత్రపతి యువజన సంఘం వారు సంయుక్తంగా విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించిన 26 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి త్వరలో వారికి కంటి అద్దాలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఛత్రపతి యువజన సంఘం సభ్యులు నర్సింలు, వెంకటేష్, కిరణ్, రాకేష్, ప్రవీణ్ రాజు, సంతోష్, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నిరంతర శ్రమతోనే లక్ష్య సాధన సాధ్యం

● నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు ఆర్మూర్ మారుతి



మారుతిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

నవీపేట,ఆగస్టు23: నిరంతర శ్రమ ఉంటే అనుకున్న లక్ష్య సాధన చేపట్టడం చాలా సులువు అవుతుందని మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పర్వతారోహకుడు ఆర్మూర్ మారుతి అన్నారు.ఇటీవల ఐరోపా ఖండంలోని ఎత్తైన ఎల్‌బ్రస్ శిఖరాన్ని అధిరోహించి ఇటీవల స్వగ్రామానికి చేరుకున్నాడు. ఈసందర్భంగా శుక్రవారం నాళేశ్వర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, పలువురు గ్రామస్థులు, యువకులు ఆర్మూర్ మారుతిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో పైకి ఎదగాలంటే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దానికి అనుగుణంగా నిరంతరం శ్రమించాలని అన్నారు.భవిష్యత్‌లో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, ప్రవీణ్, శేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎడపల్లి, ఆగస్టు23: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు జానకంపేట గ్రామంలో శుక్రవారం లబ్దిదారులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పులిశ్రీనివాస్ సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 65 మంది లబ్దిదారులకు గాను రూ.15 లక్షల 63 వేల సీఎంఆర్ఎఫ్ సహాయనిధి ద్వారా మంజూరు అయ్యాయని వాటికి సంబంధించిన చెక్కులను లబ్దిదారులకు అందించడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్ కుమార్ గౌడ్, రాదాకిషన్ గౌడ్, లింగం, ఎల్లయ్య యాదవ్, లబ్దిదారులు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అగ్నిప్రమాద భద్రతపై అవగాహన

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు23: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కాంతి హైస్కూల్‌లో శుక్రవారం విద్యార్థులకు అగ్నిప్రమాద భద్రతపై ఆర్మూర్ అగ్నిమాపక కేంద్రం వారి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ మధు సూదన్‌రెడ్డి విద్యార్థులకు ప్రమాద సమయంలో సమయస్ఫూర్తితో ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరగకుండా ఎలా కాపాడుకోవచ్చో మెళకువలను నేర్పించారు.ఈ కార్యక్రమంలో కాంతి హైస్కూల్ కరస్పాండెంట్ కాంతి గంగారెడ్డి, లీడింగ్ ఫైర్ ఆఫీసర్ సురేష్, సిబ్బంది,పాల్గొన్నారు.

జిల్లా పౌర సరఫరాల అధికారిగా అరవింద్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23: జిల్లా పౌర సరఫరాల అధికారిగా అరవింద్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మంచిర్యాల జిల్లా ఏసీఎస్‌వోగా పనిచేస్తున్న అరవింద్‌రెడ్డి ఇటీవల ప్రభుత్వం జిల్లా డీఎస్‌వోగా బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జి డీఎస్‌వోగా రెండున్నర నెలల క్రితం బాధ్యతలు స్వీకరించిన పద్మను హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

వైద్యం వికటించి యువకుడు మృతి చెందాడని రాస్తారోకో

● వైద్యుడితో వాగ్వాదం ● ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ ● నిలిచిన వాహనాలు ● పోలీసుల రాకతో ఆందోళన విరమణ



భిక్కనూరులో రాస్తారోకో చేస్తున్న దృశ్యం



ఆందోళనకారులను పోలీసులు సముదాయిస్తున్న దృశ్యం

భిక్కనూరు, ఆగస్టు 23: ప్రైవేటు వైద్యుడు చేసిన వైద్యం వికటించడం కారణంగానే యువకుడు మృతిచెందాడని, మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాతహరిజనవాడకు చెందిన కాలనీవాసులు శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని బస్టాండ్ వద్ద రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధిత కుటుంబసభ్యులు, కాలనీ వాసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెర్కల స్వామి(36) గత కొన్నిరోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం బస్టాండ్ సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి గురువారం సాయంత్రం కుటుంబసభ్యులు తీసుకురాగా వైద్యుడు చికిత్స నిర్వహించి గంట అనంతరం కొద్దిగా పరిస్థితి సీరియస్‌గా ఉందని వెంటనే కామారెడ్డికి తీసుకెళ్లమని కుటుంబసభ్యులకు తెలిపాడు. వైద్యుడి ఆదేశాల మేరకు వెంటనే కామారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలో స్వామి మృతిచెందాడు.దీంతో కాలనీవాసులు, కుటుంబసభ్యులు ప్రైవేటు ఆసుపత్రి వద్దకు శుక్రవారం ఉదయం చేరుకుని ఆసుపత్రికి మూసివేయించి వైద్యం వికటించడంతోనే స్వామి మృతిచెందాడని వైద్యుడుతో వాగ్వాదానికి దిగారు. మృతుడి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వైద్యుడి లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బస్టాండ్ ఎదుట పాత జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న భిక్కనూరు ఎస్సై సాయికుమార్ రాస్తారోకో చేస్తున్న వారిని సముదాయించి మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా కృషిచేస్తానని హమీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. రాస్తారోకో కారణంగా రోడ్డు ఇరువైపులా వాహనాలు నిలిచిపోగా పోలీసులు వాటిని పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో పాతహరిజనవాడ కాలనీవాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

పెద్దబజార్, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలన్నీ సమగ్రంగా అమలు చేయాలని అఖిల భారత ప్ర గతిశీల రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో మార్క్స్ భవన్‌లో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక సమస్యలను ముఖ్యంగా రైతన్నల సమస్యలను చర్చించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ సమగ్రంగా అమలు చేయలేదని అర్హులైన రైతుల్లో సగం మందికి రకరకాల కొర్రీలతో ఆపివేసిందన్నారు. ఆంక్షలు పెట్టకుండా రెండు లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. రైతుభరోసా కూడా ప్రారంభించాలని రైతు పంటలన్నింటికి బోనస్ 500 రూపాయలు ఇవ్వాలని పంట బీమా, రైతుబీమాకు ప్రీమియం ప్రభుత్వమే చెల్లించి వెంటనే అమలు చేయాలన్నారు. ఈనెల 25 నుంచి 31 వరకు జిల్లా వ్యవసాయ అధికారుల కార్యాలయాల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి చంద్రన్న, దేవరాం, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాము, వెంకటేశ్వర్లు, రాంచందన్, యాదగిరి, కిశోర్, సూరి, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

● పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులకు పంపిణీ చేయాలి

ధర్పల్లి: ధర్పల్లి, సిరికొండ మండల కేంద్రాలలో పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇండ్లను వెంటనే అర్హులకు పంపిణీ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఇరు మండలాల్లో పర్యటించి డబుల్ బెడ్‌రూం ఇండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఏ పథకాలను సంపూర్ణంగా పూర్తి చేయలేదని అన్నారు. అందులో ముఖ్యంగా డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రకటించి స్థలం కేటాయించి నిధులు మంజూరు చేయించి నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇప్పటివరకు పేదలకు అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేదల ఇళ్ల నిర్మాణం కల ఎండమావిగా మారిందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత కేసీఆర్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొని డబుల్‌బెడ్‌రూంలను నిర్మించి పేదలకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యం వహించారని పేర్కొన్నారు. అందుకే ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపారని అన్నారు. నివాసానికి ఉపయోగకరంగా ఉన్న డబుల్‌బెడ్‌రూంలను ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అర్హులకు వెంటనే పంపిణీ చేసి పేదవారి ఇంటి కల నెరవేర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ డివిజన్ సహాయకార్యదర్శి ఆర్.రమేష్, మండల నాయకులు ఈ.రమేష్, తదితరులు ఉన్నారు.

కొడుకును కడతేర్చిన తండ్రికి పదేళ్ల జైలుశిక్ష

నిజామాబాద్ లీగల్, ఆగస్టు 23: ఆస్తిలో వాటా అడిగిన కన్న కొడుకును కట్టెతో కొట్టి తీవ్రంగా గాయపర్చి అతని మృతికి కారణమైన కన్న తండ్రికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ సెషన్స్ న్యాయాధికారి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మోకాన్‌పల్లి గ్రామానికి చెందిన సంగెం కిషన్ గ్రామ శివారులోని అర ఎకరం వ్యవసాయ భూమి అమ్మివేయగా 9 లక్షలు వచ్చాయి. వచ్చిన డబ్బులతో తన వాటా ఇవ్వాలని కొడుకు సంగెం శ్రీకాంత్ తండ్రిని కోరాడు. ఈ విషయంలో వారు ఇద్దరు అప్పుడప్పుడు ఘర్షణ పడేవారని తెలిపారు. 14 అక్టోబర్ 2023న కిషన్ భోజనం చేసి నిద్రించాడు. తండ్రి దగ్గర ఉన్న ఫోన్‌ను శ్రీకాంత్ తీసుకొని వెళ్తుండగా తండ్రి లేచి నా ఫోన్‌ను ఎందుకు తీసుకెళ్తున్నావని అడగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మాటి మాటికి డబ్బులు అడుగుతున్నాడని కొడుకును ఎలాగైనా చంపివేయాలని నిర్ణయించుకొని కట్టెతో కొడుకు శ్రీకాంత్ తలపై బలంగా కొట్టడంతో బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కోర్టు నేరన్యాయ విచారణలో సాక్షులు న్యాయస్థానంలో చెప్పిన వాంగ్మూలాలు, ధ్రువీకరించుకున్న పత్రాలు పరిశీలించి వస్తుగత సాక్ష్యాన్ని పరిగణలోకి తీసుకొని కిషన్‌పై హత్య నేరారోపణ కాకుండా ఆవేశంతో చేసిన కారణం వల్ల శ్రీకాంత్ మృతి చెందడానికి కారకుడైనందున భారత సిక్షాస్మృతి సెక్షన్ 304 పార్ట్-2 ప్రకారం పదేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి సునీత తీర్పు వెల్లడించారు.

ఆర్మూర్‌లో విషజ్వరాలు



ఆర్మూర్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23: మున్సిపల్ పరిధిలోని ఆర్మూర్, పెర్కిట్, కొటార్మూర్, మామిడిపల్లిలో ప్రజలు విషజ్వరాలతో భయాందోళనకు గురవుతున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రతీ వార్డులో ఏదో ఒక్కరికి ప్రతీరోజు విషజ్వరాలతో పాటు మలేరియ, డెంగ్యూ, చికెన్ గున్యా వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రతీవార్డుల్లో డ్రైనేజీలో నిలిచిన నీరు, రోడ్లపై నిలిచిన నీరు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ యుపీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ నివారణ చర్యలు చేపట్టడంలేదు. ప్రతీ వార్డులో శుభ్రత లేక పోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రతీ రోజు ప్రభుత్వ ఆసుపత్రిలో ఐదు నుంచి ఆరు డెంగ్యూ కేసులు నమోదు కాగా మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు సైతం నమోదుఅవుతున్నాయి. లి, వణుకుతో కూడిన జ్వరం రోజు విడిచి రోజు వచ్చే జ్వరం తలనొప్పి, ఒంటి నొప్పులు, వంతులు వచ్చినట్టు ఉండుటా, అలసట, నిరాసం, రక్తహీనతలు కలవు.

సీపీఎస్‌ను రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 23:నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని శంకర్‌భవన్ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామం సమయంలో నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ 2003 నుంచి నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పెన్షన్ విధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని ఈ విధానాన్ని ఇప్పటికే కొన్ని రాష్ట్రాలు రద్దు చేశాయని కావున ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాములు, రజిని, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు సీపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆగస్టు 23ను బ్లాక్ డేగా ప్రకటించారు. ఈ విధానానికి కారణమైన జీరో పత్రాలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అశోక్, సంధ్య వినోద్, రవి, దీపిక, భువనేశ్వరి, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ బస్టాండ్ ఆవరణలో స్థల పరిశీలన

మోర్తాడ్, ఆగస్టు23: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ లో పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం ఆర్డీవో రాజాగౌడ్, ఆర్టీసీ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం మోర్తాడ్‌లోని బస్టాండ్ ఆవరణలో పెట్రోల్ ఆవరణలో నిర్మాణానికి కొలతలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, సర్వేయర్, ఆర్మూర్ ఆర్టీసీ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌వోఎఫ్ ఆర్ పట్టాలను ఉపసంహరించుకుంటాం

సిరికొండ ఆగస్టు 23 : 2005 తర్వాత కొత్తగా అడవీని నరికి వేయడం వల్ల వచ్చిన ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలను ఉపసంహరించుకోవడానికి జిల్లా కలెక్టర్‌కు నివేదికను అందజేయనున్నట్లు ఆర్మూర్ ఎఫ్‌డీవో భవాని శంకర్ ఒక పత్రిక ప్రకటనలో పేర్కోన్నారు. అటవీ హక్కు చట్టం 2006 ప్రకారం అర్హులైన హక్కు పత్రం లభించిన వారు వారికి కెటాయించన విస్తీర్ణంలో మాత్రమే సాగుచేసుకోవడానికి హక్కు మాత్రం ఉంటుందని ఆయన తెలిపారు.ఇచ్చిన హక్కు పత్రంలో పేర్కోన్న విస్తీర్ణం కంటే ఎక్కువ గాని, కొత్తగా పోడు చేసినట్లైయితే లబించిన అటవీ హక్కు పత్రాల రద్దు కోసం అటవీ శాఖ ఉన్నాతాధికారులకు, జిల్లా కలెక్టర్‌కు నివేదించ డం జరుగుతుందని ప్రకనటలో ఎఫ్‌డీవో పేర్కోన్నారు.అదనంగా, కొత్తగా అడవీని నరికివేసిన వారిపై అటవీ హక్కు చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.తమ సిబ్బందిపై వస్తున్న పిర్యాదుల విషయంలో కూడ శాఖ పరమైన విచారణ చేసి ప్రమేయం ఉందని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. సిరికొండ అటవీ రేంజ్ పరిదిలో జరుగుతున్న సంఘటనలపై ఆర్మూర్ డివిజన్ పరిదిలోని బృందాలుగా చేసిన సిరికొండ, తూంపల్లి, పందిమడుగు సెక్షన్‌ల పరిదిలో అటవీ సంపదను నరికివేసినట్లు తెలియ వచ్చిందని ఎఫ్‌డీవో ప్రకటనలో తెలిపారు.అడవీని నరికిన వారిని గుర్తించి వారిపై చట్టారీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కోన్నారు.కొత్తగా అడవీని నరికివేయడం వల్ల ఆర్ వోఎఫ్ఆర్ పట్టాలోస్తాయనే అపోహాలు మెండుగా ఉండడం వల్లె ఇలా జరుగుతుందని తెలిసిందని ఆయన తెలిపారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ముప్కాల్ ఆగస్టు23: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పని సరి ధరించాలని హెడ్‌కానిస్టేబుల్ విఠల్ వాహనదారులకు అవగాహన కల్పించారు. శుక్రవారం బాల్కొండ మండలంలోని బోదేపల్లి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాద నివారణాల గురించి వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సాయికుమార్, హోంగార్డు, పోలీస్‌సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీజీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆర్మూర్‌టౌన్, ఆగస్టు23: ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కన్వీనర్ వెంకటరమణ, కోకన్వీనర్ గంగాప్రసాద్ తెలిపారు. ఎస్‌టీజీయు మండల అధ్యక్షుడున్న పొన్న ప్రవీన్, ప్రధానకార్యదర్శి బంటు ఆనంద్,కార్యవర్గసభ్యులు శ్రావణి,అర్వింద్, బ్రహ్మానందం, బసంత్, లక్ష్మీనారాయణ, గంగారాం, చంద్రశేఖర్‌లు ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రానున్న సమయంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతు ఎస్‌జీటీ సమస్యలపై పూర్తిస్థాయిలో సమస్యలను సాధించుకునే పోరాడుతామని అన్నారు. గత తెలంగాణ ప్రభుత్వం జీవో 21 ప్రవేశపెట్టిన ఉద్యోగులను బలవంతం జీవో 28ని నెట్టడం జరిగిందని, ఈ రోజు బ్లాక్ డేగా భావిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంతో క్షత్రాజీ రవి, మోహన్, మధు, నరేంధర్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు23: భీమ్‌గల్ మండలంలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాదులు ప్రబలకుండా అన్ని గ్రామాల పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీఈవో సంతోష్‌కుమార్ అన్నారు. శుక్రవారం భీమ్‌గల్ మండలం బడాభీమ్‌గల్ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రోడ్లపై, గుంతల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని, లార్వ స్ప్రే, పిచ్చిమొక్కల తొలగింపు, మురుగుకాల్వ పూడికతీత పనులు క్రమం తప్పకుండా చేపట్టాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడి కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించి సీజనల్ వ్యాదులపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాలని అన్నారు.

భిక్కనూరు బీసీ హాస్టల్‌లో వైద్యశిబిరం

భిక్కనూరు, ఆగస్టు 23: భిక్కనూరు మండలకేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌లో శుక్రవారం భిక్కనూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారినీ యేమిమా హాస్టల్ విద్యార్థులకు పరిక్షలు నిర్వహించి అవసరమైన విద్యార్థులకు మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సునీత, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏఎన్ఎం శ్యామల, ఆశాసవిత, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీని అందజేస్తున్న దృశ్యం

మోర్తాడ్,ఆగస్టు23:మండలంలోని పాలెం గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తి తీవ్రఅనారోగ్యంతో హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమ్స్‌లో వైద్యఖర్చులకు ఎక్కువ డబ్బులు కావడంతో బాల్కొండ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌రెడ్డిని ఆశ్రయించారు.దీంతో సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌వోసీని సునీల్‌రెడ్డి మంజూరు చేయించి కుటుంబ సభ్యులకు అంద జేశారు. అపదసమయంలో ఆదుకున్న సునీల్ రెడ్డికి బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రమణ

భిక్కనూరు, ఆగస్టు 23: విద్యార్థులు పరిక్షల్లో ఉత్తీర్ణత సాధించేదని, తక్కువ మార్కులు వచ్చాయని క్షణికావేశాలకు లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని మానసిక వైద్య నిపుణులు వైద్యుడు రమణ అన్నారు. శుక్రవారం భిక్కనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పర్చుకుని ముందుకు సాగాలని, మత్తుపదార్థాలకు, సెల్‌ఫోన్లకు బానిసలు కావద్దని సూచించారు.ఈయుక్త వయస్సులో లవ్‌కు తావి వ్వొద్దని, ఈ వయస్సులో ప్రేమ అనేది ఆక్షణ మాత్రమేనని అన్నారు. తల్లి దండ్రుల, గురువుల మాటలను వినాలన్నారు. ఇలాంటి ఆలోచ నలను పక్కనబెట్టి చదువుపై దృష్టి సారించి లక్ష్యసాధనకు ముందుకు సాగాలన్నారు. ఎవరైనా మానసిక ఆందోళనకు గురైతే ట్రాల్‌పీ నెంబర్ 14416 కి కాల్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారినీ యేమిమా, సోషల్‌వర్కర్ వంగ రాహుల్, కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, వైద్య సిబ్బంది వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రైతు ధర్నాను విజయవంతం చేయాలి

వేల్పూర్, ఆగస్టు23: ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీపై ఆర్మూర్‌లో రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రైతుల ధర్నాను విజయవంతం చేయాలని రైతు నాయకుడు మిట్టపల్లి మహిపాల్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రేవంత్‌రెడ్డి సర్కారు ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతులందరికి ఏలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని కోరుతూ పార్టీలకు అతీతంగా చేపట్టనున్న ధర్నాను ఆర్మూర్ డివిజన్‌లోని రైతులందరు తప్పకుండా హాజరై విజయవంతం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆయన కోరారు.

రైతు వేదిక వద్దకు తరలిన రైతులు

వేల్పూర్, ఆగస్టు23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పంట రుణమాఫీ పథకంలో రుణమాఫీ కానీ రైతులు గత మూడు రోజుల నుంచి వేల్పూర్‌లోని రైతు వేదిక వద్దకు భారీగా తరలివస్తున్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి రాగానే రైతులు తీసుకున్న పంట రుణాలు మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. మూడు విడతలుగా రేవంత్‌రెడ్డి సర్కారు రుణమాఫీ చేస్తున్నప్పటికీ రుణమాఫీ జాబితాలో పేర్లు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. ఇటీవల కొన్ని చోట్ల కొన్ని గ్రామాల్లో రైతులు రోడ్లపైకి ఎక్కి ధర్నా, రాస్తారోకోలు చేశారు. దీంతో ప్రభుత్వం మండలానికో ప్రత్యేక అధికారిణి ఏర్పాటు చేసి రుణమాఫీ రాని రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది. దీంతో గత మూడురోజుల నుంచి వేల్పూర్‌లోని రైతు వేదికకు రైతులు భారీ సంఖ్యలో చేరుకొని దరఖాస్తులు చేసుకుంటు న్నారు. ఇప్పటి వరకు సుమారు 600పైగా దరఖాస్తులు చేసుకున్నారని, అందులో రేషన్‌కార్డు లేని వారు రూ.2లక్షలకు పైగా రుణం తీసుకున్న వారి దరఖాస్తుల సంఖ్య ఎక్కువగా ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.

రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

కమ్మర్‌పల్లి, ఆగస్టు23: రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న రెండులక్షల రుణమాఫీ పథకంలో అర్హులైనప్పటికీ లబ్ధి చేకూరని రైతులు తిరిగి దరకాస్తులు చేసుకోవాడానికి ప్రభుత్వం అవకాశం కల్పించడంతో గత మూడు రోజులుగా రైతులు కమ్మర్‌పల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన కేంద్రానికి మండలంలోని వివిధ గ్రామాలకు,చెందిన రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి దరఖాస్తులు చేసుకుంటున్నారు. రుణమాఫీ కాని రైతులు తిరిగి దరఖాస్తులు చేసుకుని తప్పొప్పలను సవరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించడంతో రుణమాఫీ కాని రైతులు అధార్‌కార్డులు పట్టా పాసుపుస్తకాలు, రేషన్ కార్డులతో వచ్చి దరకాస్తులు చేసుకుంటున్నారు. కమ్మర్‌పల్లి మండల ఇన్‌చార్జ్ ఏవో రమ్యశ్రీ అద్వర్యంలో నోడల్ అధికారులు రమేష్, సాయిరాంలు రుణమాఫి పథకం జాబితాలు పేర్లు రాని రైతులునుండి దరకాస్తులు స్వీకరిస్తున్నారు. కాగాదరకాస్తులు చేసుకున్న రైతుల్లో ఎక్కువశాతం (ప్యామిలి ఇండెంటిఫికేషన్)కుటుంబసభ్యుల పేర్లలో రైతుపేరు లేకపోవడం, తప్పుగా ఉండడంలాటి 336 దరకాస్తుల విచారణలో తెలినట్లు నోడల్ అధికారులు తెలిపారు.మరికొన్ని లోన్ ట్రాన్స్‌ఫర్ లాంటిదరఖాస్తులు రాగా వాటిని సరిచేసి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు.ఇప్పటివరకు 576 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

నవీపేట,ఆగస్టు23: రాష్ట్రంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తప్పకుండా అమలవుతుందని మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రైతులకు 31వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేపట్టిందని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ 5సంవత్సరాల కాలంలో చేసిన నాలుగు విడతల రుణమాఫీ వడ్డీ చెల్లింపులకే సరిపోయిందని విమర్శించారు. కొన్ని రాజకీయ పార్టీలు కావాలనే రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్‌కే బాబు, మూసా, బుచ్చన్న, సంజీవ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, రవి, కృష్ణ తదితరులున్నారు.

రైతులకు వీడీసీ,గ్రామస్థుల మద్దతు

జక్రాన్‌పల్లి, ఆగస్టు23: ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసాను ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ కలిగోట్ గ్రామ వీడీసీసభ్యులు, గ్రామస్థులు మద్దతు తెలిపారు. శనివారం ఆర్మూర్ పట్టణంలో మామిడిపల్లిలోని శ్రీసాయిగార్డెన్‌లో జరిగే రైతుల ధర్నాకు మద్దతు తెలుపుతూ కార్యక్రమానికి రైతులు, గ్రామస్థులు అధిక తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

డిగ్రీ కళాశాలలో వసతులను పరిశీలించిన ఎన్‌సీసీ అధికారులు

మోర్తాడ్, ఆగస్టు23: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ మంజూరు చేయడానికి శుక్రవారం ఎన్‌సీసీ అధికారులు సందర్శించారు. ప్రవేశాల ప్రాంగణం, మౌలిక వసతులు, విద్యార్థుల సంఖ్య, భవనం, గ్రౌండ్, కంప్యూటర్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని అధికారులు ధ్రువీకరించారు. రెండేళ్ల క్రితం ఎన్‌సీసీ యూనిట్ కొరకు దరఖాస్తు చేయగా జిల్లా కేంద్రం నుంచి అధికారులు వచ్చి పరిశీలించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న తెలిపారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థులకు ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఎన్‌సీసీ ఇన్‌చార్జీ భూపతిని నియమిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజయ్య, రవీందర్, అవంతి, అర్చన, అశోక్, సిబ్బంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శ్రీనివాస్

బీజేపీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలి

కామారెడ్డి టౌన్, ఆగస్టు 23: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతీ కార్యకర్త పకడ్బందీగా చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు అల్లాపూర్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెలలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. సెప్టెంబరు 2న ప్రధాని నరేంద్రమోదీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం చేస్తారని, 3వ తేదీన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాష్ట్రంలో నమోదు కార్యక్రమం ప్రారంభిస్తారని అనంతరం 5న జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రారంభం చేయాలని సూచించారు. 2014లో చైనా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని అధిగమించిన బీజేపీ సభ్యత్వంలో ప్రపంచంలో మొదటి స్థానాన్ని నిలబెట్టుకుంటుందని అన్నారు. ప్రతీ కార్యకర్త సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. 8800002024 నెంబర్‌కు సభ్యత్వ నమోదు చేసుకోవచ్చని, నమోదు ద్వారా, ఒకవేళ వీలుకాని వారు సభ్యత్వ నమోదు దరఖాస్తు ఫారం ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని అన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

● మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకుల ధర్నా

మద్నూర్, ఆగస్టు 23: మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామంటూ మద్నూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కింద ఆయా పాఠశాలల్లో మహిళలు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వండి వారుస్తున్నారు. అటువంటిది గత కొన్ని నెలలుగా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ మద్నూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నాకు దిగారు. కిరాణా షాపుల వద్ద అప్పులు పెరిగిపోయి తిరిగి అప్పు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం మద్నూర్ తహసీల్దార్, మండల విద్యాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.

విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

● మండల ప్రత్యేక అధికారి దయానంద్

నసురుల్లాబాద్, ఆగస్టు 23: పాఠశాలలో విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సెంటర్‌లోని అంగన్‌వాడీ టీచర్లు విద్యార్థుల పట్ల అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తప్పవని మండల ప్రత్యేక అధికారి దయానంద్ పేర్కొన్నారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని లింగంపల్లి తండా ప్రాథమిక పాఠశాలను, అదే విధంగా గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ సెంటర్‌లో విద్యార్థులు లేకపోవడంతో విద్యార్థులు సెంటర్‌కు ఎందుకు రాలేదని అంగన్‌వాడీ టీచర్‌కు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెంటర్‌లోని రిజిష్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు సెంటర్‌కు తప్పకుండా వచ్చేలా చూడాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేయాలన్నారు. అనంతరం ఫ్రైడే డ్రైడేలో భాగంగా గ్రామంలోని మురికి కాలువలు, వీధులను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని పంచాయతీ సెక్రెటరీ శంకర్‌కి ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి వెంట ఎంపీవో సూర్యకాంత్, ఉపాధి హామీ ఏపీవో సౌజన్య తదితరులు ఉన్నారు.



డీఎస్పీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

మహరాజుపై చర్యలు తీసుకోవాలి

● బాన్సువాడలో మైనార్టీ సోదరుల ర్యాలీ

బాన్సువాడ, ఆగస్టు 23: మహారాష్ట్ర సోలాపూర్‌లో మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రామ్‌గిరి మహరాజ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాన్సువాడ పట్టణంలో మైనార్టీ సోదరులు ర్యాలీని శుక్రవారం బాన్సువాడ జామ మసీద్, మసీద్ నూర్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలు డీఎస్పీ సత్యనారాయణకు, ఆర్డీవో కార్యాలయంలో డీఏవోకు వినతిపత్రం అందజేశారు. శాంతి సందేశం ఇచ్చిన మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని రామ్‌గిరి మహరాజ్‌పై మహారాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జామా మసీద్ అధ్యక్షుడు ఇంతాజ్ హైమద్, అలీబిన్ అబ్దుల్లా, ఫైసల్, అక్బర్‌గౌస్, నీయమ్, అజీమ్, వహాబ్, ఇలియాస్, మైనారిటీ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కామారెడ్డి టౌన్, ఆగస్టు 23: కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పాటు, అక్షర పాఠశాలలో సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కార్యక్రమం చేపట్టారు. సైబర్ నేరాల పట్ల బాధితులు టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదులు చేసుకోవచ్చని తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

సదాశివనగర్, ఆగస్టు 23: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగ సంఘం మండల అధ్యక్షుడు కృష్ణాకర్‌రావు అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాల్సింది పోయి సీపీఎస్ విధానంలో కొనసాగుతామని చెప్పిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలిపిన విధంగా ఉద్యోగులకు సామాజిక భద్రత లేని సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి బాలకిషన్‌రావు, జిల్లా కోశాధికారి చింతల లింగం, ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, మధుకృష్ణ, షాకిర్, జాస్మిన్, జీవలత, చాంద్‌పాషా, రాజకుమార్,సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం బ్లాక్ ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీకాంత్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో భోజన విరామ సమయంలో పంచాయతీ రాజ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులు శ్రీకాంత్, అంకిత్, స్నేహ, సౌందర్య, వసంత, శ్రీనివాస్, అనిల్, సత్యం పాల్గొన్నారు.

బాన్సువాడ: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయ విరామంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆర్డీవో కార్యాలయం ముందు జీవో 28కి వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బాన్సువాడ డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్ద కొడప్‌గల్: పెద్ద కొడప్‌గల్ మండల ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు జగదీష్ మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి కిషోర్, ఉపాధ్యాయులు మధు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులందరూ కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు హన్మాండ్లు మాట్లాడుతూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 28కి



ధర్మారావుపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘ ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ అమలులోకి తేవాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో..



బాన్సువాడలో..



పెద్దకొడప్‌గల్‌లో..



ఎల్లారెడ్డిలో..

అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందించే బాధ్యత నాదే..

జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్



ఎమ్మెల్యే తోట సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న దృశ్యం

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు 23: జుక్కల్ నియోజక వర్గంలో అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ ఫలాలు అందే బాధ్యతను తాను తీసుకుంటానని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావ్ పేర్కొన్నారు. శుక్రవారం జుక్కల్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన నాయకులు ఎమ్మెల్యే తోట సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ పది సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ చేయలేని రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తే బీఆర్ఎస్ పార్టీ ఓర్వలేక కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తుందని దుయ్యబట్టారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదన్నారు. తాను రుణమాఫీ విషయంపై మంత్రి తుమ్మలతో మాట్లాడానన్నారు. జుక్కల్ నియోజక వర్గంలో అర్హులైన రైతులకు రుణమాఫీ అందించే బాధ్యత తనదే అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమేష్ దేశాయ్, విఠల్ రావ్, ఇమ్రాన్, వివిధ మండలాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు మద్దతు కోరుతూ మంత్రులకు వినతి



మంత్రులకు విన్నవిస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు

పెద్ద కొడప్‌గల్, ఆగస్టు: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పునిచ్చిన నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు శుక్రవారం పలువురు మంత్రులను హైదరాబాద్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తోట మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని తీర్పునిచ్చిన నేపథ్యంలో తమకు మద్దతు ఇవ్వాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మరో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. దీంతో పాటుగానే దేశ వ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా ఆయా రాష్ట్రాలు మద్దతు ఇచ్చే విధంగా శనివారం నుంచి పర్యటిస్తామని తోట తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, నాయకులు మోత్కుపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

కాటేపల్లి గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రూసేగాం భూమయ్య మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ఆనందంగా ఉందని, అయితే రిజర్వేషన్ల అంశం తొందరగా అమలు చేయకపోతే తిరిగి మాదిగ జాతికి అన్యాయం జరిగే ఆస్కారం ఉందని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు సాయిలు, రవీందర్, చిన్న పర్వయ్య,పెద్దసాయిలు, వీరయ్య, పండరి, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

రాజంపేట, ఆగస్టు 23: రాజంపేట మండలంలోని అన్నారంతండాకు చెందిన బానోత్ తిరుపతి(33) పొలంలో విద్యుత్‌షాక్‌తో మృతి చెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. శుక్రవారం ఉదయం పొలంలోకి పనుల కోసం వెళ్లగా తన పొలం పక్కవారి కరెంట్ సప్లయ్ కోసం తీసుకున్న కరెంట్ వైర్లు తగిలి ప్రమాదవశాత్తు మరణించినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో దొంగతనం చేసిన వ్యక్తి అరెస్టు

గాంధారి, ఆగస్టు 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చొరబడి కంప్యూటర్‌కు సంబంధించిన పరికరాలు, హాస్పిటల్‌లోపల పార్క్ చేసిన ఒక బైకును దొంగలించారు. ఈ దొంగతనం గురించి హాస్పిటల్‌లో రాత్రివేళలో పని చేసిన మమ్మాయి రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టగా మండలంలోని గుర్జాల్ గ్రామానికి చెందిన ములుగు గణేష్ అలియాస్ గని అనే పాతనేరస్థుడుని పట్టుకుని విచారించగా అతను చేసిన నేరంను ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం, కంప్యూటర్ పరికరాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రౌడీ షీటర్‌పై కేసు నమోదు

ఎల్లారెడ్డి, ఆగస్టు 23: రౌడీ షీటర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి శ్రీనివాస్‌గౌడ్ స్నేహితుడైన సతీష్‌ను గండిమాసానిపేట్ గ్రామానికి చెందిన రౌడీషీటర్ గడ్డం జగన్‌గౌడ్ బూతు మాటలతో తిడుతుండగా అలా ఎందుకు తిడుతున్నావని శ్రీనివాస్‌గౌడ్, జగన్ గౌడ్‌ని అడుగగా మధ్యలో ఎందుకు వస్తున్నావు అని బూతు మాటలతో తిడుతూ చంపేస్తా అని బెదిరించడంతో శ్రీనివాస్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఫ్లెక్సీల తొలగింపు

ఎల్లారెడ్డి, ఆగస్టు 23: ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటో ఉన్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ఫొటో ఫ్లెక్సీలో లేనందున నిబంధనలకు విరుద్ధంగా ఫ్లెక్సీని స్థానిక ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఫ్లెక్సీని తీసి సుభాష్‌రెడ్డి వర్గానికి సంబంధించిన నాయకులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, నాయకులు నాగం గోపికృష్ణ, గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

బీర్కూర్, ఆగస్టు 23 : బీర్కూర్ మండల కేంద్రంలోని నగేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలు గత మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలు కొనసాగాయి. ఉదయాన్నే యంత్ర ప్రతిష్ఠ ముహూర్తం, విగ్రహ ప్రతిష్ఠాపన, శిఖర ధ్వజ స్తంభం, ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. నగేరేశ్వర ఆలయ గర్భగుడిలో గణపతి, శివలింగం, నందీశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో అఖండ హరినామ సప్తాహ ప్రారంభం

బీర్కూర్, ఆగస్టు 23: మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో శుక్రవారం అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం వారం రోజుల పాటు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్కారీలు భజనలు, కీర్తనలు పాడుతుండగా భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.

విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఎదగాలి

బాన్సువాడ టౌన్, ఆగస్టు 23: విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని ఇంటర్నేషనల్ చెస్‌బాక్సింగ్ ఛాంపియన్ ప్రతిభ తక్కెడపల్లి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రిపుల్స్ పాఠశాలలో విద్యార్థులకు స్వీయరక్షణ చేసుకునేందుకు ఆమె ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రతీ విద్యార్థి ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింగ్‌రావు, ఉపాధ్యాయులు తదితరులున్నారు.



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



బీర్కూర్‌లో యాదవ సంఘం భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

బీర్కూర్, ఆగస్టు 23: బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌లు శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీర్కూర్‌లో పునర్నిర్మించిన నగరేశ్వర ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీర్కూర్‌లో 10 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నసురుల్లాబాద్, ఆగస్టు 23: మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలే కాకుండా వివిధ మండలాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిక కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD
ABR/DISPUTE No. 58 of 2024

Between:
M/s. Margadarsi Chit Fund Pvt Ltd., Nizamabad Branch ...Disputant
AND
MR. B. SRICHAND and Others ...Opponents

To NOTICE

OPP:1 Badavath Srichand, S/o B. Bhikya, Aged about 43 Yrs, Occ: School Asst. MPUPS - Thimmapur, Mdl: Birkur, Dist. Kamareddy.; R/o: H.No.1-77/2, Nr. Bus Stand, Vill: Sangam, Mdl: Nasrullabad, Dist. Kamareddy.
OPP: 2 Palathya Ravi, S/o P. Lal Singh, Aged about: 38 Yrs, Occ: Panchayath Secretary, Grama Panchayath, Mirzapur, Mdl: Nasrullabad, Dist. Kamareddy.; R/o: H.No.1-105, Vill: Sangam, Mdl: Nasrullabad, Dist. Kamareddy.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Summons were issued to you, but you have failed to receive the same. The above Dispute is posted on **18-09-2024** for your appearance. On that day you have to appear in person at **10-00 A.M.** before the Deputy Registrar referred above. Other wise the case will be decided.

Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NIZAMABAD.

BEFORE THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD
ABR/DISPUTE No. 107 of 2024

Between:
M/s. Margadarsi Chit Fund Pvt Ltd., Nizamabad Branch ...Disputant
AND
MR. A.K. LAXMAN and Others ...Opponents

To NOTICE

OPP:3 Vadla Gopal, S/o V. Ramakistaiah, Age: 37 Yrs., Occ: S G Teacher, M P P S - Korpole, Mdl: Lingampet, Dist: Kamareddy.; R/o: H.No.:-3-83, Vill: Banapur, Mdl: Lingampet, Dist: Kamareddy.
OPP: 4 Soleti Venkatesh, S/o. S. Anjaiah, Age: 38 Yrs., Occ: S G Teacher, MPPS- Konapur, Mdl: Bibipet, Dist: Kamareddy.; R/o: H.No.:-4-7/1/1, Main Road, Muthyampet, Mdl : Domakonda, Dist: Kamareddy.
OPP: 6 Arukala Kurra Padma, W/o. A.K. Laxman, Age: 31 Yrs., Occ: Tailoring at Home, R/o: H.No.:3-97, Kyasampally, Kamareddy.
OPP: 7 Ankam Shyamaiah, S/o: A. Laxmaiah, Age: 43 Yrs.,Occ: School Asst., ZPHS- Shabdipoor, Dist: Kamareddy.; R/o: H.No.:-6-13/C, Vill: Arepally, Mdl: Rajampet, Dist: Kamareddy.

Take notice that the above dispute is filed against you and others for recovery of money. Summons were issued to you, but you have failed to receive the same. The above Dispute is posted on 28-08-2024 for your appearance. On that day you have to appear in person at 10-00 A.M. before the Deputy Registrar referred above. Other wise the case will be decided exparte.

Sd/- DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR NIZAMABAD.

సదా మీ సేవలో...

పత్రిక సరఫరాలో మీకు ఏమైనా ఇబ్బందులు ఉన్న యెడల ఈ దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు..

కామారెడ్డి - ఎల్లారెడ్డి
90322 16482

అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ : 99854 11454

బ్రాంచ్ మేనేజర్ సెల్: 99854 11451

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Kamareddy Branch, Dist. Kamareddy agreed to accord Loan to TEJAVATH RAMESH S/O KISHAN, aged about 34 Years, Occ: Business, R/o H.No. 5-32, Somaram Thanda village of Gandhari Mandal, Kamareddy District, mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within 7 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE OF THE PROPERTY

Open Plot No. 10, lies in Sy.No. 452/1, 452/2 & 452/3, admeasuring North to South: 57.0 Feets, and East to West: 30.0 Feets, and the total area of which 1710.0 Sq.Feets, (190.0 Sq.Yards), equal to 158.85 Sq.Mts., situated at Gandhari village & Mandal, Kamareddy District, under the jurisdiction of Regn.Sub Dist Yellareddy, and Regn.Dist Nizamabad (Subject matter to the Regd.Sale Deed Deed Doct.No. 1255/2022 Dtd.16.06.2022 SRO Yellareddy)

Bounded as below

North: 20.0 Feet wide Road, **South:** Open Plot No. 5 of Sarampally Ravi Goud, **East:** Open Plot No. 8 of Sarampally Ravi Goud & Open Plot No. 9 , **West** : Land of Thati Bhadraiah

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Kamareddy Branch, Dist. Kamareddy agreed to accord Loan to SABAVATH SADAR S/O JAIRAM, aged about 36 Years, Occ:Business, R/o H.No. 39-2-47, Sai Krishna Enclave, Near P.M.H. Temple, Badangpet, K.V.Rangareddy District, (Aadhar No. xxxx xxxx 3004), mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within 7 days of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property.
Hence this notice

SCHEDULE OF THE PROPERTY

Southern Portion of Open Plot No. 1, lies in Syno. 209/54, vide L.P.No. 8/85, admeasuring North to South: 30.0 Feets, and East to West Northern side: 33.0 Feets, Southern side: 25.0 Feets, and the total area of which 870.0 Sq.Feets, (96.6 Sq.Yards0, equal to 80.2 Sq.Mts., Situated at Devanpally, Kamareddy Town & District, under the jurisdiction of Regn.Sub Dist Kamareddy, and Regn.Dist Nizamabad (Subject matter to the Regd.Sale Deed Deed Doct No. 8406/2017 Dtd.08.12.2024 SRO Kamareddy)

Bounded as below

North: Remaining Northern Portion of Open Plot No.1, **South:** 30.0 feet wide Road, **East:** Open Plot of Neighbours , **West** : 30.0 feet wide Road

Sd/- R. Jagadishwer Rao
B.Com, LLB.,Advocate,
H.No. 6-2-67, Subhash Nagar,
Nizamabad, Ph: 9848094409

డ్రైడే ఫ్రైడేను పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

బీర్కూర్, ఆగస్టు 23: బీర్కూర్ మండల కేంద్రంలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. అయితే మండల ప్రత్యేక అధికారి నగేష్ బీర్కూర్‌లో పర్యటించి కార్యక్రమం తీరును పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో పిచ్చి మొక్కలు పెరగడం, గుంటల్లో డ్రైనేజీలో, మురికి నీరు, వర్షం నీరు నిలవడం వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పంచాయితీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహబూబ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ గంగారాం, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి	- డబుల్ ఇస్మార్ట్
దర్శన్	- మిస్టర్ బచ్చన్
ప్రియా 70	- తంగలన్
ప్రియా 35	- ఆయ్

బాన్సువాడ

మహేశ్వరి	- మిస్టర్ బచ్చన్
వెంకటేశ్వర	- తంగలాన్

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	150	180
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

